క్లుప్తంగా

శావల్యాపురంలో ఆటో చోరీ

శావల్యాపురం: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శావల్యాపురం గ్రామానికి చెందిన దూదెకుల పెద సైదాకు చెందిన ఆటోను కనక దుర్గమ్మ దేవాలయం ప్రధాన కూడలి మార్గంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేశాడు. ఇదే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను చోరీ చేసినట్లు గుర్తించారు. అయితే చోరీకు పాల్పడిన వ్యక్తులు సెంటరులో ఉన్నదుకాణాల్లో మరో చోరీ చేయడానికి ప్రయత్నాలు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఆటో చోరీకు గురైన విషయాన్ని గురువారం స్థానిక పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు సారథ్యంలో ప్రధాన కూడలి మార్గాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిలించారు. పోలీసులు చాలెంజ్‌గా తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మండలంలో ఇటీవల వరుసగా బైకులు చోరీలకు అవుతున్నాయి. ప్రధాన సెంటరు పార్కింగ్ చేసిన ఆటో చోరీ జరగటంపై ప్రజల్లో తీవ్ర చర్చనీయంగా మారింది.

సమస్యలు పరిష్కరించాలంటూ..



నరసరావుపేట: అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు కొద్దిసేపు ధర్నాచేసి వినతిపత్రం అందజేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఆప్కాస్‌లో పేరు నమోదు చేయాలని, వర్కర్లకు కొబ్బరినూనె, చెప్పులు ఇవ్వాలని, ఈ ఏడాది చేసిన సమ్మెకాలపు జీతంతో పాటు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, దేవంగి కోటయ కుటుంబానికి ప్రమాదబీమా కింద రూ.5 లక్షలు, అతని కుటుంబానికి రెండుసెంట్లు స్థలం, రావిపాడు, లింగంగుంట్ల నుంచి వచ్చి కార్మికులుగా కొనసాగుతున్న వారికి క్యాజువల్ సెలవలు, పండగ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు మల్లయ్య, యోహాను, అచ్చినరసింహారావు, జయంపు శ్రీను, రోశయ్య పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

శావల్యాపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాలు కల్గిన ఆహారాన్ని తీసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం మండలంలోని ఇర్లపాడు గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో పోషకాహార మాసోత్సవాలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, పంచాయతీ కార్యదర్శి కొమిటినేని అశోక్‌చౌదరి, ఆరోగ్య కార్యకర్త భూదేవి, యం.అమరలింగేశ్వరి, కార్యకర్తలు హరణి, విజయ, హేనాగ్రేస్, అరుణాకుమారి పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

నాదెండ్ల: గణపవరం విద్యుత్ సెక్షన్ పరిధిలో మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. పలు గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో విద్యుత్ మీటర్లలో అవకతవకలు, అధికలోడు, అనధికార కనెక్షన్లు గుర్తించి అపరాధ రుసుము రూ.3,36,000లు వసూలు చేశారు. గురువారం గణపవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌డీఏ సర్కిల్ విద్యుత్ శాఖ ఎస్ఈ విజయకుమార్ నేతృత్వంలో గుంటూరు టౌన్2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అనధికారికంగా అధిక లోడు వినియోగిస్తున్న 60 సర్వీసులను గుర్తించి రూ.2,26, 000లు, మరో నాలుగు సర్వీసుల నుండి రూ.1 లక్ష జరిమానా విధించారు. రాబోవు రోజుల్లో తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. దాడుల్లో డీఈఈలు అశోక్‌కుమార్, గురునాధరావు, ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ



రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 120 మంది బాల బాలికలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దేవి అనంత ప్రసాద్ స్టీల్ ప్లేట్లు గురువారం అందజేశారు. వీటి విలువ రూ.10 వేల రూపాయలు. ప్లేట్లు అందించిన దేవి అనంత ప్రసాద్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా అనంత ప్రసాద్, లక్ష్మీ గార్లు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పాఠశాల అభివృద్ధికి మరింత సహాయ సహకారాలు అందిస్తామన్నారు. హెచ్ఎం వై. హనుమంతరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బండి కాదు మొండి..

- కాలంతీరిన బస్సులతో ప్రయాణం నరకం
- మార్గమధ్యంలో ఆగిపోతున్న వినుకొండ ఆర్టీసీ బస్సులు
- వానలకు కారుతున్న పాతబస్సులు
- డ్రైవర్లకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన పాతబస్సులు



నాగులవరం సమీపంలో అదుపుతప్పిన పాతబస్సు (ఫైల్)



నాగులవరంవద్ద రిపేరువచ్చి ఆగిన పల్లెవెలుగు బస్సు (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల): ఆర్టీసీ సేవలు ప్రజలకు అందడం లేదు. అస్తవ్యస్తంగా సర్వీసుల నిర్వహణ, కాలం చెల్లిన బస్సులతో అంతంతమాత్రంగా సేవలు అందుతున్నాయి. ప్రయాణం సురక్షితం అనే నినాదానికి కాలంచెల్లిన బస్సులతో ప్రయాణికులు భయపడుతున్నారు. వినుకొండ ఆర్టీసీ డిపో పరిధిలో 25కుపైగా కాలంతీరిన బస్సులను తిప్పుతున్నారు. పల్లె వెలుగు సర్వీసులు పూర్తిగా పాత బస్సులు కావడంతో డ్రైవర్లు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినుకొండ డిపో పరిధిలో మొత్తం 72 బస్సులు ఉండగా పల్లె వెలుగు బస్సులు 36 వరకు ఉన్నాయి. అయితే అందులో పాత బస్సులు నడుపుతుండటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. తరచూ రిపేర్లు రావటం, మధ్యలో ఆగిపోవటం, ప్రయాణికులు ఇతర బస్సుల్లో వెళ్లడం పరిపాటిగా మారింది. పూర్తిస్థాయిలో గమ్యస్థానం చేరుకుంటామోలేదోనని ప్రయాణికులు అనుమానంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేస్తున్నారు. వినుకొండ నుంచి పొదిలి, దర్శి, ఒంగోలు, బొల్లాపలి మండలంలోని పలు గ్రామాలతో పాటు, వినుకొండ– నరసరావుపేట, ఉల్లగల్లు, ఈపూరు మండలాలకు పాత బస్సులే దిక్కయ్యాయి.

వర్షాకాలం వస్తే అంతే..

వినుకొండ డిపో పరిధిలో వర్షాకాలం వస్తే బస్సులు బస్సుల్లో కూడా వర్షంనీరు లీకులు ఇచ్చి కారుతుండటంతో బస్సుల్లో కూడా గొడుగులు వేసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వైపర్లు పనిచేయకపోవటంతో డ్రైవర్లు బస్సును రోడ్డుపైనే ఆపుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గత రెండు రోజుల క్రితం ఒంగోలు వైపు వెళుతున్న పాసింజరు బస్సు వైపరు పనిచేయకపోవటంతో మార్గ మధ్యలో అద్దంకి డిపోలో సుమారు గంటకుపైగా బస్సును నిలపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఒంగోలు వెళుతున్న బస్సు నాగులవరం వద్ద రిపేరు రావటంతో రోడ్డుపైనే బస్సును నిలపివేసి వేరే బస్సుల్లో ప్రయాణికులను తరలించారు. గత సోమవారం పాత బస్సు అదుపుతప్పి రోడ్డుమార్జిన్ పక్కకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పాత బస్సులు కావటంతో డ్రైవర్లకు కంట్రోల్ కాక అదుపుతప్పి డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.

ఇప్పటికైనా పాతబస్సులను నిలిపి వేసి నూతన బస్సులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డిపో మేనేజర్ ఏమన్నారంటే..



ఈవిషయమై ఆర్టీసీ డిపో మేనేజరు కోటేశ్వరరావును వివరణ కోరగా 15 ఏళ్ల నుంచి తిరుగుతున్న బస్సులను పూర్తిగా నిలపివేశాం. గత కొన్నేళ్ల నుంచి ఆర్టీసీకి నూతన బస్సులను ఇవ్వకపోవటంతో పాతబస్సులను నడపాల్సి వస్తుంది. 15 ఏళ్లు నిండిన బస్సుల స్థానంలో వేరే డిపోల నుంచి ఫిట్‌నెస్ ఉన్న బస్సులు కేటాయిస్తున్నారు. కొత్తబస్సులు మాత్రం ఇవ్వడం లేదు.

– కోటేశ్వరరావు నాయక్,
డిపో మేనేజరు వినుకొండ

బాధితులను ఆదుకోవడంలో..

చంద్రబాబు ఘోర వైఫల్యం

- ప్రచార ఆర్భాటంపై ఉన్న ఆసక్తి బాధితులపై లేదు!
- వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు



చిలకలూరిపేట: వరద బాధితులను ఆదుకునే విషయంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు విమర్శించారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు విపత్తు సమయంలో సైతం ప్రచారానికి పెద్దపీట వేసుకోవడం తప్పించి బాధితులను ఆదుకోవడంలో ఏ మాత్రం చిత్తశుద్ధి ప్రదర్శించ లేదన్నారు. భారీ వర్షాలు, వరదలు వస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా కూటమి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం వహించిందన్నారు. ప్రమాదం పొంచి ఉందని ముందే తెలిసినా ప్రజలను అప్రమత్తం చేయకపోవడం, ప్రమాద పరిస్థితుల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించలేక పోయారని మండి పడ్డారు. వరదలు ముంచెత్తిన తర్వాత ప్రజలు తమకు తాము సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లే క్రమంలో ముంపు బారిన పడి ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపం మొత్తానికి సీఎం చంద్రబాబే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రజలను కాపాడడంలో విఫలమైన ప్రభుత్వం బాధిత ప్రజలకు ఆహారం, నీరు వారికి కావల్సిన కనీస వసతులు కల్పించటంలో ఘోరంగా విఫలమైందన్నారు. తన కరకట్ట నివాసం మునిగి పోతుందని కలెక్టరేట్‌కు నివాసం మార్చిన సీఎం చంద్రబాబు నాయుడుకు, ప్రజలు మునిగిపోయి ప్రాణాలు కోల్పోకుండా కాపాడాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు.

ప్రచారానికే పెద్దపీట..

వరద బాధితులను ఆదుకోవడంలో దారుణంగా విఫలమైన ప్రభుత్వం ప్రచార అర్భాటంతో దానిని కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు సమీక్షల పేరుతో కాలయాపన చేస్తూ అధికారులను వారి విధుల్లో పాల్గొనలేని పరిస్థితులు కల్పిస్తున్నారని విమర్శించారు. గతంలో విశాఖ ప్రాంతంలో హుద్‌హుద్ తుఫాను సమయంలోనూ నాడు సీఎంగా ఉన్న చంద్ర బాబు రాత్రి సమయాల్లో పర్యటిస్తూ ఆయన వెంట అధికార యంత్రాంగాన్ని తిప్పుకున్న విషయాన్ని గుర్తు చేశారు. దీని కారణంగా పగటి సమయాల్లో అధికార యంత్రాంగం విధుల్లో పాల్గొనలేని పరిస్థితి నాడు సైతం కల్పించారని వెల్లడించారు. ముందు ప్రచార ఆర్భాటాన్ని పక్కన పెట్టి వరద బాధిత ప్రజలకు మంచి చేయడంపై దృష్టి సారించాలని మనోహర్ సూచించారు.

వైఫల్యాలను కప్పి పుచ్చుకొనేందుకు...

ఎప్పుడూ లేని విధంగా విజయవాడ ప్రాంత ప్రజలు ముంపు బారిన పడితే వారిని ఆదుకోవడంలో విఫలమైన చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలకు తెరతీశారని ఆరోపించారు. వర్షాలకు 60 మంది చనిపోవడం ఎప్పుడూ చూడలేదని, దీనిని కప్పిపుచ్చేందుకు వరద కారణంగా ప్రకాశం బ్యారేజీకి బోట్లు కొట్టుకువస్తే దానిని రాజకీయం చేయడం ఒక్క చంద్రబాబుకే చెల్లిందన్నారు. ఇది తగదన్నట్లు వైఫల్యాలను దారి మళ్లించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వారిని అరెస్టు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగమే దళిత వర్గానికి చెందిన మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్టు అని పేర్కొన్నారు.

బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించాలి

వినతిపత్రాలు అందజేసిన బడ్జెట్‌వాచ్, మాలమహానాడు నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రభుత్వం త్వరలో ప్రవేశపెడుతున్న 2024–25 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ క్రింద వివిధ పథకాలకు నిధులు కేటాయించాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వారి కార్యాలయాల్లో కలిసి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. డాక్టర్ చదలవాడ, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్, మాల మహానాడు నాయకులు ఉస్తెల జయరావు, దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కమిటీ సభ్యులు మేడే వెంకట రమణ, గుండాల మాణిక్యరావు వినతి పత్రాన్ని అందజేశారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



బహుమతులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.1,30,000 రూపాయలు మెరిట్ స్కాలర్ షిప్‌లు పంపిణీ చేయడం జరిగింది. పాఠశాలలో 2023 మార్చిలో 6 నుంచి 10వ తరగతి వరకు జరిగిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి క్రింద రూ.15,000 రూపాయలు, ద్వితీయ బహుమతి క్రింద రూ.12,000 రూపాయలు, అదే విధంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2,500 రూపాయలు, రూ.2,000 రూపాయలు పంపిణీ చేయడం జరిగింది. అదే విధంగా మండలంలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు రూ.12,000 రూపాయలు విలువ జేసే బహుమతులు అందజేసినారు. వివిధ క్రీడలలో గెలుపొందిన 90 మంది విజేతలకు రూ.30,000 రూపాయలు విలువ కలిగిన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శివప్రసాద్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

డాక్టర్ గోపిరెడ్డికి పలువురు శుభాకాంక్షలు



డాక్టర్ గోపిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి 55వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఎమ్మెల్యే జన్మదినం కాగా, బుధవారమే పలువురు డాక్టర్లు, బంధువులు, కుటుంబ సభ్యులు, పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయన స్వగృహంలో జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. పలువురు పార్టీ నాయకులు దుశ్శాలువ కప్పి పూలదండలు వేసి ఆయనచే బర్తడే కేక్ కట్ చేయించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కాగా, ఈ ఏడాది విజయవాడలో వచ్చిన వరదల కారణంగా తాను జన్మదినం నిర్వహించుకోవట్లేదని, ఆ ఖర్చును వరదబాధితులకు సహాయం చేద్దామని పార్టీ శ్రేణులకు డాక్టర్ గోపిరెడ్డి సూచించిన విషయం విదితమే.

పీఈటీ నాగరాజుకు సన్మానం



చిరుమామిళ్లలో పీఈటీ నాగరాజును సన్మానిస్తున్న విద్యాదాత నడికట్టు రామిరెడ్డి

నాదెండ్ల: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల ఛైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కృష్ణంశెట్టి వెంకటనాగరాజు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుందరరావు, గ్రామస్తులు యన్నం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ శిలాఫలకం ధ్వంసం



ఈపూరు: బొమ్మరాజుపల్లిలో సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకాన్ని బుధవారం సాయంత్రం పలువురు ధ్వంసం చేశారు. వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా ఇరువర్గాలవారు రాళ్లు రువ్వుకోవడంతో ఆ రాళ్లు తగిలి ఒక మహిళకు, మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. ప్రస్తుతం గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురువారం పోలీసులు పికెట్ ఏర్పాటు చేశామని రూరల్ సీఐ ప్రభాకర్, ఈపూరు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

మేమంతా గోపిరెడ్డి వెంటే..



రొంపిచర్ల: ఎప్పుడూ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అండగా ఉండి ఆయనతోనే నడుస్తామని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలోని బీసీ కాలనీ వాసులు తీర్మానించారు. గ్రామంలోని బీసీ కాలనీలో గురువారం సమావేశమై గోపిరెడ్డితోనే చివరిదాకా నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. బీసీ నాయకులు మాట్లాడుతూ కాలనీలో 450 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని పేర్కొన్నారు. అవసరమైన వారికి మరో రెండు ఎకరాలు కొనుగోలు చేసి అవసరమైన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చే ఆలోచనలో ఉన్నారన్నారు. కాలనీకి ఆయన చేసిన అభివృద్ధిని, ఆయన సొంతనిధులతో చేసిన పనులను వారందరూ మరోక సారి పేర్కొన్నారు. కొందరు స్వార్థపరులు విగ్రహం వద్ద రాజకీయాలు చేసి మా మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారన్నారు. వడ్డేర కులస్తులందరం ఒకటిగానే ఉంటామని పేర్కొన్నారు. విగ్రహం వద్ద జరిగిన సంఘటనలను సర్ది చెప్పుకుంటామన్నారు. ఎటువంటి ఘర్షణలకు దిగమన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలతో పలువురు బీసీ పెద్దలు పాల్గొన్నారు.

తురిమెళ్లలో కారు-బైక్ ఢీ

రొంపిచర్ల: మండలంలోని తురిమెళ్ల గ్రామ సమీపంలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు అయ్యాయి. ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు తురిమెళ్ల వైపు నుండి వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల ఇరువురిని 108 అంబులెన్స్‌లో నరసరావుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వరద బాధితుల కోసం..



నరసరావుపేటలో వస్తువులను ప్యాకింగ్ చేస్తున్న డ్వాక్రా మహిళా లీడర్లు



చిలకలూరిపేటలో విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

విరాళాలు సేకరించిన సీపీఐ నాయకులు

చిలకలూరిపేట: వరద బాధితులను ఆదుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ కోరారు. వరద బాధితుల సహాయార్థం సీపీఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదల కారణంగా విజయవాడ ప్రాంతంలో భారీగా ఆస్తినష్టం, ప్రాణనష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్నవారిని మానవత్వంతో ఆదుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వరదల్లో అన్ని కోల్పోయి ప్రజలు పొయ్యి కూడా వెలిగించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఆపన్న హస్తం అందించి మానవత్వం చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, మహిళా సమాఖ్య అధ్యక్ష,కార్యదర్శులు శివలీల, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు వితరణ

నరసరావుపేట: స్థానిక 12వ వార్డు సాయికిరణ్ సమైక్య, రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్, జన జాగృతి సారథ్యంలో విజయవాడ వరద బాధితులకు కోసం డ్వాక్రా గ్రూపు మహిళలు తమకు తోచిన విధంగా సహాయం చేశారని ట్రస్టు ఛైర్మన్ పూనూరి కృష్ణకుమారి గురువారం తెలిపారు. సుమారు 400 మందికి సరిపడా దుస్తులు, నిత్యావసరాలను తీసుకెళ్లే వాహనానికి డాక్టర్ చదలవాడ ఆదిత్య జెండా ఊపి ప్రారంభించారు. సహాయం చేసిన వారందరికీ కృష్ణకుమారి ధన్యవాదాలు తెలిపారు. సరుకుల పంపిణీ కార్యక్రమంలో షేక్ మస్తాన్‌బీ, షేక్ నూర్జహాన్, షేక్ సుల్తాన్‌బి, షేక్ సుల్తానా, షేక్ మహాబీ, పి.రమాదేవి పి.శంకర్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మించాలంటూ ఎంపీకి వినతి



ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్థానిక నాయకులతో కలసి పనులు పరిశీలించారు. పనుల పురోగతిపై స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి విడుదలైన రూ.20 లక్షల నిధులతో కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు పరిశీలించారు. గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి నుంచి రైల్వే స్టేషన్ వరకూ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఆయనను కోరారు. బీసీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీ లాడ్స్ నిధులు సమకూర్చాలని స్థానికులు వినతిపత్రం అందించారు. గ్రామంలోని జాతీయ రహదారి నుంచి రైల్వే స్టేషన్ వరకూ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బకాయిలు సక్రమంగా వసూలు చేయాలి

నరసరావుపేట డివిజన్ విద్యుత్ అధికారి ఎస్.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఈ శ్రీనివాసరావు

రొంపిచర్ల: విద్యుత్ బకాయిలు సక్రమంగా వసూలు చేయాలని నరసరావుపేట డివిజన్ విద్యుత్ అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక హైవే రోడ్డు పక్కన గల విద్యుత్ కార్యాలయంలో గురువారం నరసరావుపేట రూరల్ సబ్- డివిజన్ పరిధిలో గల రొంపిచర్ల, నకరికల్లు, శావల్యాపురం, ఈపూరు మండలాల పరిధిలో గల విద్యుత్ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న నరసరావుపేట డివిజన్ విద్యుత్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ నూరు శాతం విద్యుత్ రెవెన్యూ వసూలు చేయాలన్నారు. గ్రామాలలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలన్నారు. నూతన సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్న వినియోగదారులకు వెంటనే సర్వీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం విద్యుత్ బకాయిలు వసూలు, సమస్యలపై సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రామిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వెంకటేశ్వరరెడ్డి, ఆయా మండలాల ఏఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ సర్వీసులు పెంచాలి

చిలకలూరిపేట: ప్రయాణీకుల సౌకర్యార్థం చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపునకు వెళ్లే బస్సుల సంఖ్య పెంచాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని కోరారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.రాంబాబును గురువారం కలసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. దీంతోపాటుగా కోటప్పకొండ భక్తుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం బస్ సర్వీసు నడపాలన్నారు. రిటైర్డ్ డ్రైవర్లు, కండక్టర్ల స్థానంలో కొత్తవారిని నియమించాలని కోరారు. ఈ విషయమై డీఎం రాంబాబు మాట్లాడుతూ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు బి.శ్రీనునాయక్, రాంబాబునాయక్ పాల్గొన్నారు.



లాలిపురం తండాలో రూ.70,216లకు లడ్డును కైవసం చేసుకున్న మాన్‌సింగ్ నాయక్



నరగాయపాలెంలో రూ.1.50 లక్షలకు లడ్డును దక్కించుకున్న అంజిరెడ్డి, బాలాజి



గుంటుపాలెంలో రూ. ఒక లక్ష 35 వేలకు లడ్డూ దక్కించుకున్న ఎం.నాగేశ్వరరావు



నరసరావుపేట అరవైఅడుగులరోడ్డులోని చవితి పందిరిని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి